# ఆగిపోయిన నీల ఆదర్శ వివాహం

"గడప దాటావు ? ఏమనుకుని దాటావు ? చివరకేం చేశావు ?''

కన్నీటితో తడిసిన తలవెంట్రుకలను పైకినెట్టుకుంటున్న నీలను నిలవదీసి ప్రశ్నించింది మనసు.

రెండు చేతులతో తల బాదుకుంది నీల.

''అనాడెందుకు ఊరుకున్నావు ? కదలనీయకుండా నన్నెందుకు ఆపలేదూ ?'' ఉక్రోషంతో ఎదురు ప్రశ్నించింది నీల.

"నీవు ఒళ్ళు తెలియకుండా ఉరుకు పరుగుల మీద ఉన్నావు. అసలు నన్ను ఎందుకు అడగలేదు ?"

"అవును అడగని మాట నిజమే. నా కళ్లకు పొరలు కమ్మాయి. ఉద్రేకంలో ఉన్నాను. లోతుగా ఆలోచించలేదు. నిన్ను సంప్రదించలేదు. అప్పుడు స్వామితప్ప ఇంకేమీ కంటికి కనబడలేదు.'' నీల మళ్ళీ పక్కమీద వాలిపోయింది.

రెండు రోజుల క్రిందట కాలేజి పిల్లలంతా ఎక్స్‌కర్షన్‌కు వెళ్లాలని నిశ్చయించుకున్నారు. పాతికమైళ్ల దూరంలో రెండు కొండల మధ్య గలగల దూకి పడుతున్న జలపాతాన్ని చూడాలని గత సంవత్సరం కూడా పదిమంది విద్యార్థులు ముందుకు వచ్చారు. కాని వ్యాన్‌లో వెళ్లేటప్పుడు పాతికమందయినా ఉండాలన్న వెంకటస్వామి ప్రయత్నం సాగలేదు. ఈ సంవత్సరం రెండు నెలల ముందునుంచీ ప్రయత్నం చేసి అందరినీ కలుసుకుని ప్రయాణం ఖర్చు వసూలు చేశాడు. ఎక్స్‌కర్షన్‌కని ఎన్నుకున్న ప్రదేశం చాలా ఆకర్షణీయంగా ఉంది. జలపాతం కొండల మీదినుంచి ఉరవడితో దిగివచ్చి ఒక నదిలా మెలికలు తిరుగుతూ పారుతూ ఉంటుంది. ఆ నది కాక ప్రక్క పచ్చనిచేలూ మరొక పక్క ఏపుగా గుబురుగా చలువ పందిళ్ళు వేసినట్లున్న తోటలూ పడుచు గుండెలను పరవళ్ళు తొక్కించేటట్లున్నది.

ఆ రోజు పాతికమందికి సరిపడా కాంటీన్ ఏర్పాట్లు చేశాడు వెంకటస్వామి.

ఉదయం ఐదుగంటలకు తల్లితో చెప్పి ఒకచిన్న బ్యాగ్‌లో తనకు కావలసిన పౌడరు దువ్వెన వగైరా సామాను వేసుకుని వెంకటస్వామి రమ్మన్నచోటికి నీల వెళ్ళింది. అప్పటికే వ్యాన్ సిద్ధంగా ఉంది. విద్యార్థినీ విద్యార్థులు వచ్చారు.

గలగల్లాడుతూ నవ్వుల జల్లులతో అందరూ ఎక్కగానే వ్యాన్ బయలుదేరింది ఊరు దాటగానే చల్లటిగాలి-స్పీడ్ పెంచి పరుగెత్తే వ్యాన్-చెవులుగింగుర్లెత్తేటట్టు మాట్లాడుకుంటూ, గాలికి చెదిరిన తల వెంట్రుకలను సర్దుకుంటూ-సిగ్గు లొలక బోస్తూ తలవంచుకుని నవ్వుకునే విద్యార్థినులూ-వాళ్లను చూసి హేళనగా నవ్వుకునే విద్యార్థులూ తమ షివల్రీనంతా ముఖాల మీదనే కనబరుస్తూ హుషారుగా కాళ్లూపుకుంటూ పక్కచూపులతో విద్యార్థినులను గుచ్చిగుచ్చి చూసే కొత్త విద్యార్థులూ-అందరూ ఏదో కొత్త లోకంలో విహరించటానికి పోతున్నట్టుగా ఉంది.

అనుకున్నవేళకు నిర్దేశించిన ప్రదేశానికి చేరుకుంది వ్యాన్. బిలబిల్లాడుతూ అందరూ దిగారు. సరిగ్గా ఎనిమిది గంటలకు విద్యార్థులలో ఒకరు జంపఖానా ఒకటి వ్యాన్‌లో నుంచి బయటికి తీశారు. నలుగురూ పట్టుకుని చెట్లకింద పరచారు. కాంటీన్ బాయ్, అందరూ వరసగా కూర్చోగా చూసి, బ్రేక్‌ఫాస్టు కాఫీ అందించాడు.

తింటూ, మాట్లాడుతూ, మధ్యమధ్య కాఫీ సిప్ చేస్తూ, త్వరగా ముగించి, విద్యార్థులు ఒక చెట్టుకింద చేరి, సిగరెట్లు వెలిగించారు. కొందరు విద్యార్థినీ బృందంతో కలిసి మరో చెట్టుకింద చేరి కబుర్లలోకి దిగారు. పది నిమిషాలలో అందరూ జలపాతం దగ్గరికి రోడ్డుదాటి వెళ్లారు. నది ఒడ్డున కాళ్ళు నీళ్ళలో మునిగేటట్లు కూర్చుని ఆ జలపాతాన్ని దాని ఉరవడినీ చూస్తూ కూర్చున్నారు. కొందరు సాహసవంతులు కొండల పైకెక్కి చూడాలని ప్రయత్నించి కొంత దూరం వెళ్ళి తిరిగివచ్చారు.

''అప్పుడే వచ్చేసేరేం ? చివరిదాకా వెళ్లకపోయారా ? జలపాతం ఎక్కడి నుంచి పుట్టిందో చూసొచ్చి మాకు చెప్పచ్చుగా ?'' అన్నారు కింద కూర్చున్న వాళ్లు.

పైకెక్కుతుంటే కాళ్ళు కిందికి జారుతున్నాయని చెప్పలేక "ఆ అందమైన ప్రదేశాన్ని చూసి మేమొకళ్లమే ఆనందిస్తే స్వార్థపరులమవుతామేమోనని పించింది. ఆనందాన్ని అందరూ పంచుకుంటేనే తృప్తిగా ఉంటుందని దిగే శాము'' అన్నారు.

అందరూ గొల్లున నవ్వారు.

"ఇంకా కాళ్ళు నానపెట్టక లేచిరండి. ఆటలు మొదలు పెడదాం'' అన్నా రొకరు.

అందరూ లేచారు.

రోడ్డుకూ తోటకూ మధ్య నాలుగడుగుల స్థలం రోడ్డు పొడుగునా ఉంది. కిలో మీటర్లను చూపించే రాళ్ళు అక్కడక్కడ పాతి ఉన్నాయి. బహుశః ఫుట్ పాత్ కోసం కావచ్చు.

"ఒక బ్యాచ్ విద్యార్థినీ విద్యార్థులు ఒక కిలోమీటర్ రన్నింగు చేసి పావు గంటలో తిరిగిరావాలి'' అన్నాడు అందరికీ లీడరుగా ఉన్న వెంకటస్వామి.

''పావుగంట చాలదు. అరగంట పెట్టండి. పావుగంట వెళ్లటానికే చాలదు'' అంది ఒక విద్యార్థిని.

అందరూ నవ్వారు. "ఎందుకు ? హంస నడకలతో వెళ్లాలనా ? నడవటం కాదు, పరుగెత్తాలి'' అన్నాడు లీడరు.

ఆమె మాట్లాడకుండా వెనక్కు తగ్గింది. మరొక విద్యార్థిని ముందుకు వచ్చింది. కాని-పావుగంటలో-వెళ్ళిన ఒక విద్యార్థి మాత్రము ముందుగా తిరిగి వచ్చాడు.

ఎదురుగావెళ్ళి అతడి భుజంతట్టి ''కొంచెం రెస్టు తీసుకో మంచినీళ్ళు తాగు'' అన్నాడు వెంకటస్వామి.

అందరూ తిరిగి వచ్చేటప్పటికి అరగంటకు ఒక నిమిషం అటూ ఇటూ అయింది.

''కాలికొద్దీ పరుగెత్తటం అందరూ నేర్చుకోవాలి. ఎటువంటి పరిస్థితుల

లోనూ ఇది ముఖ్యం'' అన్నాడు లీడరు. తరువాత జాగింగ్ చేయించాడు. మళ్ళీ ఒక వరస టీ త్రాగేరు అందరు.

''చూడండి ఇప్పుడు మనం కళ్ళకు గంతలు కట్టుకుని గుమ్మడి పండు ఆట అంటే Hide and Seek ఆడబోతున్నాం. తోటలో ఇంకా కొంచెం లోపలికి పోతే చెట్లు ఇంత గుబురుగా దగ్గర దగ్గరగా లేవు. దూరదూరంగా ఉన్నాయి. మనం ఈ ఆట అక్కడ ఆడుకోవచ్చు. దీనిలో పాల్గొనే వారెవరో ముందుకు రండి" లీడరు వెంకటస్వామి ఒక్కొక్కరినీ పిలుస్తున్నాడు.

కేటీ లిల్లీ మాటీ గౌరీ ముందుకు వచ్చారు. 'రాకపోతే పిరికివాళ్ళన్న పేరు వస్తుంది. ఆమాత్రం ఆడలేక పోతామా !' అనుకున్నారు. ఒక్క వెంకటస్వామి తప్ప-విద్యార్థులందరూ పాల్గొంటామని తలలూపారు.

వాళ్ళల్లో తిలక్ కళ్ళకు గంతలు కట్టించుకున్నాడు. అందరు అరుస్తూ చెట్ల చుట్టూ పరుగులు తీశారు. తిలక్ చేతులతో వెతుకుతూ వెళ్ళటం మొదలుపెట్టాడు. ఎంతదూరం పోయినా-ఒక్కరూ చేతికి చిక్కలేదు. ఆడపిల్లలూ మగపిల్లలూ దగ్గరగా వచ్చినట్టు పిలవటమూ పారిపోవటమూ తిలక్కి అవమానమనిపించింది. గంతను కాస్త పక్కకు జరుపుకుని, కనబడీ కనబడనట్టు చేసుకుని, గౌరి పైట చెంగు పట్టుకులాగాడు. ఆ గుంజటంలో ఆమె కిందపడిపోయింది. ఆమెను కాళ్ళ పట్టుకుని పైకి లేవదీసి ఊపాడు. ఆమె ఊపిరాడక కెవ్వుమని కేకపెట్టింది. ఆమెను చటుక్కున వదిలేశాడు. మోచేతులు గరుకునేల రాచుకుని కొట్టుకుపోయాయి. కాలు మెలికపడ్డది గౌరికి.

ఆమె క్రిందపడగానే అందరూ చుట్టూ మూగారు. దూరంగా కూర్చుని ఆటనుచూస్తున్న నీల పరుగెత్తుకుంటూ వెళ్ళి గుంపులోకి దూరి గౌరిని లేవదీసి కూర్చోబెట్టి, తన చేతిగుడ్డతో గాయాన్నీ ఆమె బట్టల కంటిన మట్టినీ దులిపి మెల్లగా నడిపించుకుంటూ తీసుకువచ్చి జంపఖానా మీద కూర్చోబెట్టింది. బట్టను నీళ్ళతో తడిపి గాయాలన్నీ తుడిచి తన బేగ్‌లో ఉన్న పౌడరు అద్దింది.

''కొంచెంసేపు పడుకో. నా ఒళ్ళో తలపెట్టుకుని, అసలెందుకు వెళ్లావు ఈ ఆటలోకి ? నీకసలే పరుగెత్తడంరాదు'' అంటూ ఆమె చెదిరిన తలవెంట్రుకలు సవరిస్తూ మంచినీళ్ళు తాగించింది నీల.

అంతలో మరో బేచ్ బయలుదేరింది. ఐదు నిమిషాలు సవ్యంగా నడిచిన ఆట కేటీ కెవ్వుమనటంతో నీల గౌరిని జంపఖానా మీద పడుకోబెట్టి కేటీకోసం పరుగెత్తుకుంటూ వెళ్ళింది కేటీని చెట్లమధ్య కీడ్చి రెండుచేతులతో ఆమె తలవెంట్రుకలు పట్టుకుని పైకెత్తుతున్నాడు ఒక విద్యార్థి.

''ఒదులు-కేటీని ఒదులు. ఏమిటా మోటుదనం? తలవెంట్రుకలు పట్టుకుని పైకి లేవదీస్తావా ?'' అరుస్తూ కేటీని తీసుకువచ్చి తనదగ్గర కూర్చోపెట్టుకుని తలవెంట్రుకలు సరిచేసి కళ్ళు తుడిచింది నీల.

''ఏమిటి నీలా. నీ పాటలో పాల్గొనలేదు. పైగా వీళ్ళను కూడా తీసుకొచ్చి పిరికిమందు పోస్తూ నీ పక్కన కూర్చోబెట్టుకుంటావా ? వచ్చినప్పటినుంచీ చూస్తున్నాను. నీ ధోరణి ఏంబాగలేదు" కోపంతో పెద్దపెద్ద అడుగులు వేసుకుంటూ వచ్చాడు వెంకటస్వామి.

''ఇవి ఆటలా ? ఆడపిల్లల జుట్టుపీకటం, కొంగుపట్టి లాగటం కింద పడెయ్యటాన్ని ఆటలంటారా ? ఇట్లాంటి ఆటలంటే ఆడపిల్లలు వస్తామంటారా ? అతడి గుప్పెట్లో కేటీ తలవెంట్రుకలు ఎన్ని ఉన్నాయో చూడు. ఏదో సరదాకి జలపాతం చూద్దామంటే మేము వచ్చాంగాని ఇటువంటిపిచ్చి ఆటలంటే వస్తామా ?" మాటీ చర్రుమని లేచింది.

"ఆటలంటే ఏమిటో తెలియని అప్పలమ్మలనుకోలేదు. తోటి విద్యార్థులతోనైనా మర్యాదగా మాట్లాడే మంచి స్నేహితులమనుకుని పిలిచాము ఇప్పుడు కాదని తెలిసింది" అన్నాడు వెంకటస్వామి ముఖం తప్పుకుని అక్కసుతో.

''పీళ్లని వద్దంటే విన్నావా ? ఆటలంటే స్పోర్టివ్‌గా ఉండాలని తెలియని బైతులను ఏరిఏరి తీసుకొచ్చావు'' అన్నాడొక విద్యార్థి. అతడి వెనక షర్టు చేతులు పైకి తీసుకుని ఏడెనిమిది మంది నిలబడ్డారు.

వేన్ డ్రైవరూ కాంటీన్‌బాయ్ నిలబడి చూస్తున్నారు.

''బాయ్ మాకు వడ్డించి తీసుకురా. ఇంక లంచ్‌టైమ్ అయింది మాకు ఇక్కడికే తీసుకురా" గౌరి లేచి ఆర్డరు చేసింది.

''ఆ పాపలకు ఆకలేస్తున్నదట వడ్డించు. మేము చెట్లకింద భోజనం

చేస్తాం'' అన్నారు విద్యార్థులు వెకిలిగా నవ్వుతూ.

విద్యార్థినులంతా ఒకచోట లంచ్ తీసుకున్నారు. విద్యార్థులు గుంపులుగా చెట్లకింద కూర్చున్నారు. భోజనాలయిన తరువాత అక్కడే కూర్చుని పేకాట మొదలుపెట్టారు.

నీల, 'ఎవరూ అక్కడికి వెళ్ళకూడద'ని కళ్ళతోనే సైగ చేసింది. అంతా ఒకచోటేకూర్చుని మెల్లగా మాట్లాడుకోవటం మొదలుపెట్టారు.

పేకాటలాడే విద్యార్థుల కళ్ళు అప్పుడప్పుడు ఇటు తిరిగి చూస్తునే ఉన్నాయి. ఆ చూపుల్లో రవంత ఎరుపుదనం లేకపోలేదు.

ఇద్దరు విద్యార్థులు ద్వంద్వార్థాలు గల సినిమా డ్యూయెట్లు పాడటం మొదలుపెట్టారు. నీల, గౌరి, లీల అబ్బబ్బ అంటూ చెవులు మూసుకున్నారు.

ఒకసారి గాలి దుమారంగా పైకిలేచి ఎండుటాకులనూ దుమ్మునూ ఎగజిమ్మి పోయింది. పేకముక్కలు లేచి ఆకులలో కలిసి చాలా దూరం వెళ్ళాయి.

విద్యార్థులంతా లేచి కొంతసేపు ఇటూ అటూ తిరిగి "నాలుగు గంటలు కావచ్చింది, టీ స్నాక్సు అందించవోయ్" అన్నాడు కాంటీన్‌బాయ్‌తో స్వామి.

ఒక చెట్టుచాటున రాళ్ళను అడ్డంపెట్టుకుని టీ తయారుచేశాడు బాయ్. ఒక్కొక్కళ్ళే అతడి దగ్గరకే వెళ్ళి తమకు కావలసినన్ని అడిగి తెచ్చుకుంటున్నారు. కొందరు ఆ చెట్టుదగ్గరే నిలబడి తీసుకుని, కాలవవైపుకు వెళ్లారు ముఖాలు కడగటానికి.

వాళ్ళు వచ్చిన తరువాత విద్యార్థినులు వెళ్ళి ముఖాలుకడిగి అక్కడే తలలు దువ్వుకుని నీటిపైనుంచి వచ్చేగాలి చల్లగా ఉందనుకుంటూ గట్టుమీద కూర్చున్నారు.

గౌరి కేటీ మెల్లగాలేచి వేన్ డ్రైవరు దగ్గరికెళ్ళి ''సరిగ్గా ఐదుగంటలకు వ్యాన్ బయలుదేరతియ్యి. మా విద్యార్థినులను ముందు మా యిళ్ళలో దింపు. మేము నీ సీట్ వెనకసీట్లో కూర్చుంటాము" అన్నారు.

అప్పుడే అందరితోపాటు టీ తాగి ఒకబీడీ వెలిగించిన డ్రైవరు ''అబ్బాయిగార్లంతా బయలు దేరుతున్నారా మీతో ?'' అడిగాడు.

''చూడు. వాళ్ళనడిగితే, చీకటిపడ్డ తరువాత బయలుదేరవచ్చులే అంటారు. నీకేదో పనుందని చెప్పి తొందరగా బయలుదేరతియ్యి. ఇంటికెళ్ళగానే నాన్నకు చెప్పి నీకు మంచి ఇనాం ఇప్పిస్తా"నంది గౌరి. ఆ డ్రైవర్‌కి రాజేశంగారితో ఏవో పనులు ఉంటునే ఉంటాయి. ఆయన అతడికి ఎన్నోసార్లు సహాయంచేసి ఉద్యోగం నిలబెట్టిన సందర్భాలు కూడా ఉన్నాయి.

"నా పేరు బయటపడనియ్యకు" మళ్ళీ అన్నది గౌరి.

''లేదమ్మా, నా మీదనే భారంపెట్టుకుంటా'' నన్నాడు.

మరో పదినిమిషాలాగి కాంటీన్‌బాయ్ తన సామానంతా సర్దుకుని వ్యాన్‌లో పెట్టుకున్నాడు. డ్రైవరూ అతడు కలిసి జంపఖానా మడతలు చేసిపెట్టారు.

చెట్లదగ్గర ఇటూ అటూ తిరుగుతున్న విద్యార్థులు గుంపులు గుంపులుగా దగ్గరకొచ్చి "అప్పుడే అంతా సర్దేస్తున్నావేమిటోయ్'' అని పరుగెత్తుకుంటూవెళ్ళి వెంకటస్వామితో చెప్పారు.

డ్రైవరు, వెంకటస్వామి దగ్గరకెళ్ళి 'తన కవసరమయిన పని ఉందనీ- అదీగాక చీకటిపడితే తనకళ్ళు సరిగా కనబడటంలేదనీ' అన్నాడు.

''మొదట చెప్పకుండా తరువాత ఆలోచించుకున్నట్టున్నావు. సరేలే'' నసుగుతూ మళ్ళీ చెట్లదగ్గరకెళ్ళాడు సిగరెట్టందుకోవటానికి వెంకటస్వామి.

విద్యార్థులందరూ అటుదిరిగి ఇటుతిరిగి ఒకర్నొకరు పిలుచుకుంటూ తాత్సారం చేశారు.

చివరకు వ్యాన్ బయలుదేరేటప్పటికి మొదలు అనుకున్నట్టుగా చీకట్లు కమ్ముకొస్తున్నాయి. తీరా వ్యాన్ బయలుదేరబోతుండగా చిన్నకారొకటి వచ్చి నిలబడ్డది.

వ్యాన్‌లోనుంచి వెంకటస్వామి దిగి ''మీ నాన్నగారు కారు పంపించారు నీ కోసం. వ్యాన్‌లోనుంచి దిగి ఈ కారులో ఎక్కు" అన్నాడు నీలతో.

''నాన్నగారు కారు పంపటమేమిటి? ఈ కారు మాదికాదు. డ్రైవరు కూడా నాకు తెలియదు.''

"నేను కూడా వచ్చి దింపివెళ్తాను'' అన్నాడు స్వామి.

''గౌరీ, మాటీ కేటీ మా నాన్నగారు కారు పంపించారు. నేను వెళ్తున్నాను. మీరు కూడా నాతోవస్తే దింపిపోతాను" అందరినీ పిలిచింది నీల.

"వాళ్లు వస్తే నీకు ఆలస్యమవుతుంది. తొందరగా రమ్మని కారు పంపించా రంటే ఎంతో అవసరమయిన పనిఉండే ఉంటుంది'' అంటూ కారును పోనివ్వ మని డ్రైవరితో చెప్పాడు వెంకటస్వామి.

"జాగ్రత్తగా వెళ్ళండి'' అంటూ కేకపెట్టింది నీల.

కారు కదిలింది. అందరూ టాటా అంటూ ఉండగా వ్యాన్ కూడా బయలు దేరింది.

"ఇవాళ నీవు చాలా వింతగా ప్రవర్తించావు నీలా. ఎందుకని ?" అడిగాడు వెంకటస్వామి కినుకతో.

"నేనేం చేశాను ?"

''నా స్నేహితులందరినీ అవమానపరచావు''

''ఎప్పుడు ?''

''స్పోర్ట్సు సందర్భంలో నా సంతోషం సగం చచ్చిపోయింది"

''అవునుగాని ఈ కారు మా నాన్నగారు పంపించినదయితే తప్పుదారిన పోతున్నదేమిటి ? డ్రైవర్‌కి మా యిల్లు తెలియదా ?'' ఆమె భయంగా చూడ సాగింది.

"కారు ఎటుపోతున్నదంటే-నీవే చెప్పావుగా ? 'మన యువజన సంఘం కొన్ని సంస్కరణలు తలపెట్టింది. వాటిని ముందు మనమే ఆచరించి చూపిద్దా మని ?' అందుకే ఈ రోడ్డు చివరఉన్న దేవుడిగుడి వైపుకు కారును పోనివ్వ మన్నాను. అక్కడే మనపెళ్ళి. దండలు మార్చుకుంటే చాలు. నీవు దేవుడికి కొబ్బరికాయ కొడతానన్నావు. కొట్టు. తరువాత పెద్ద హోటల్లో నా స్నేహి తులకు విందు. అది కాగానే మనం రూంలోకి వెళ్తాం. ఇదీ ప్లాను. ఈ కారు నేను తెప్పించాను. ఈ ప్లాను ముందర మన మనుకున్నదేగా" జ్ఞాపకం చేస్తున్నట్టుగా అన్నాడు. అతడు తననుకున్న పనిని మంచి మాటలతో జరిపించాలనుకుని ఆమె

మీద ఎంతకోపం వచ్చినా పైకి కనబడనీయటం లేదు. ఇలా ఉంటేనే ముందు ముందు లాభం" ఆమె ముఖంలోకి చూశాడు చాలా తెలివిగా మాట్లాడుతున్నట్టుగా.

"ఇప్పుడా ? ఈ మాట నిన్న నీవనలేదే ? నేను ఇంట్లో చెప్పిరాలేదు. మా నాన్నగారు నిద్రకూడా లేవలేదు. ఇప్పుడు చాలా పొద్దుపోయింది. నేను సాయంత్రానికే ఇంటికి వస్తానని ఎదురుచూస్తూ ఉంటారు. మా నాన్న వచ్చేవరకూ నేను యింట్లో ఉండాలి. ప్లీజ్, స్వామీ. మా యింటికి తీసుకెళ్ళమని చెప్ప డ్రైవరుతో" భయమూ ఆందోళన రెండూ ఆమెను ఊపేస్తున్నాయి. నీలకు కళ్ళల్లో నీళ్ళు ఊరటం మొదలుపెట్టాయి.

"ఇంతవరకూ వచ్చి వెనకడుగువేస్తావేం ? పెళ్ళిమాట ముందర మనమనుకొన్నదేగా ?'' జ్ఞాపకం చేశాడు వెంకటస్వామి మళ్లీ.

నీలకు ఉపాయంతో తప్పించుకోవటం తప్ప మరొక మార్గం కనబడలేదు. తను ఒంటరిగా అతడి చేతికి చిక్కింది.

"అదికాదు స్వామీ. నీవు కొన్ని నగలూ డబ్బు తీసుకురమ్మన్నావు. ఇవాళ ఇంట్లో సందడిగా ఉంది. వీలయిందికాదు. ఇప్పుడు నీవు చెప్పిన ప్లాను ప్రకారం ఒక వెయ్యి రూపాయలపైన ఖర్చు కనబడుతుంది. నేను మామూలుగా పర్సులో ఉండే పదిరూపాయల నోటుతో వచ్చాను అవేంచాల్తాయి ? చేసిన పని ఆడంబరంగా లేకపోయినా ఆదర్శంగానయినా ఉండాలా ? అందుకని రెండు రోజులాగు. నీవు చెప్పినట్టు సిద్ధమైవస్తాను'' ధైర్యం తెచ్చుకుంటూ అన్నది.

"నమ్మమంటావా ? ఛీఛీ, ఇవాళ ప్లానంతా తలక్రిందులయింది. పాటల ప్రోగ్రామ్ పెడితే అదీ పాడయిపోయింది. ఏమయిందట తిలక్ యుగళగీతం పాడితే ? అంత రెచ్చిపోయిందేం గౌరీ ? ఆ మాటీకెంత పొగరు ? ఇదంతా నువ్వే చేశావని నాకనిపిస్తోంది. అందుకే మిమ్మల్ని నమ్మకూడదని మా స్నేహితుడు వెంకటేశు చెప్తునే ఉన్నాడు" మండిపడ్డాడు వెంకటస్వామి.

''కోపం తెచ్చుకోకుస్వామీ. నన్ను నమ్ము. ఇవాళ జరిగిన వాటికి నేను బాధ్యురాలిని కాను. ప్లాన్ ప్రకారం ఇవాళమాత్రం నేను సిద్ధంగాలేను. ప్లీజ్ నన్ను మా యింటిదగ్గర దింపెయ్యి" వేడుకుంటోంది నీల.

"సరే. ఈసారి మాటతప్పావో నిన్నేంచేస్తానో నాకేతెలియదు. నీ ముఖం

చూసి నీ మాటలు నమ్మాను. నా నమ్మకం-నా ఆదర్శాలు వృధా చేయవని నీకీ ఛాన్సు ఇస్తున్నాను. కారు మీయింటిదగ్గరికి రాదు. ఈ రోడ్డు చివర ఆపేస్తాడు. దిగివెళ్ళు'' ముఖం పక్కకు తిప్పుకుని "ఆ పదిరూపాయల నోటు ఇచ్చివెళ్ళు అన్నాడు.

పర్సు తెరిచి నోటు తీసి అతడి చేతిలో పెట్టి 'ఇప్పటికి బతికి పోయా'ననుకుని, ''స్వామీ. నామీద కోపంవచ్చిందా ?'' అన్నది అనునయిస్తున్నట్టుగా.

అతడేం మాట్లాడలేదు.

నీల కారు దిగి వెనక్కు తిరిగి చూడకుండా పరుగెత్తుతూ సందు తలుపు తెరిచిఉంటే లోపలికి దూరింది. ఇంట్లో తల్లి స్నేహితులతో మాట్లాడుతున్నట్టుగా సందడి వినిపిస్తోంది. మెల్లగా తన గదిలోకివెళ్ళి స్నానంచేసి అలసిపోయిన దేహాన్ని మంచమ్మీదికి చేరవేసింది.

అందరినీ పంపించి తల్లి లోపలికి వచ్చి ''పిల్లల భోజనాలయ్యాయా ?'' అనుకుంటూ ఇల్లంతా ఒకసారి తిరిగి నీల గదిలోకి వచ్చింది.

''ఎప్పుడొచ్చావు నీలా ? పడుకున్నావేం ?" మంచమ్మీద కూర్చుంది కూతురిమీద చెయ్యివేస్తూ.

''నేను ఆరుగంటలకే వచ్చానమ్మా. కొంచెం తలనొప్పిగా ఉంటే పడుకున్నాను.'' తల్లి నడుమును చేతులతో చుట్టేసింది.

"జ్వరం వచ్చిందా ? ఏదీ చూడనీ.'' నుదుటిమీద చెయ్యేసిచూసి "జ్వరం ఉందే. ధర్మామీటర్ తెచ్చిచూస్తా ఉండు'' అంటూ తెచ్చి చూసింది.

''అమ్మో, నూటరెండు. అన్నయ్యను పిలుస్తానుండు'' అంటూ కొడుకును పిలిచింది.

"కాంతం. నువ్వు చూడరా.'' అంది.

''జ్వరం ఉన్నమాట నిజమే కాని క్రోసీన్ మాత్రవేసి కప్పు కాఫీతాగి పడుకోమను. పగలంతా తిరిగింది. ఆ అలసటకు వచ్చినావస్తుంది జ్వరం. రేపు కూడా ఇలాగే ఉంటే డాక్టర్ని పిలుద్దాం. ఇంతలోకి నాన్నకూడా వస్తారుగా'' అన్నాడు. అతడు మూడో సంవత్సరం మెడిసిన్ చదువుతున్నాడు.

పదిగంటలు దాటిన తరువాత తండ్రివచ్చాడు. రాగానే నీల సంగతంతా చెప్పింది తల్లి. ''మాత్రవేసి కాఫీ ఇచ్చాను" అంది.

ఆయన ''ఏదో అలసటకీ వచ్చిఉంటుంది. తగ్గుతుందిలే'' అంటూ భోజనం చేసి పడుకున్నాడు.

తల్లి నీలదగ్గరే పడుకుంది ఒక పక్కగా మంచంవేసుకుని.

రాత్రి రెండుగంటలకు నీలకు మెలకువ వచ్చింది. జ్వరం జారింది కాని మానసికంగా అయోమయంగా ఉంది. ఏవేవో ఆలోచనలు కెరటాలల్లా వచ్చి మీదపడినట్లవుతోంది. కలత నిద్రలో భయంకరమైన విషయాలు-జరిగినట్లో లేక జరగబోతున్నట్లో అర్థంకాని మానసిక సంక్షోభ.

''గడప దాటటమేమిటి ?''

''సుఖపడ్డావా అన్నమాట ఏమిటి ?"

"తన జీవితానికి సంబంధించినవా ?"

నుదురు రుద్దుకుంటూ, తలమీద చేతులతో కొట్టుకుంటూ 'అమ్మా' అంటూ గట్టిగా మూలిగింది.

''అమ్మా" అన్న కేకకు తల్లిలేచి "జ్వరం తగ్గిందా నీల. ఆఁ. జారినట్టే ఉంది. చెమటలుపోశాయి. భయపడ్డావా నీలా ?" తలమీద చెయ్యివేసి తలవెంట్రుకలు సర్దుతూ అడిగింది.

''లేదమ్మా. కాని ఏమిటోగా ఉంది, చెప్పలేకుండా ఉన్నాను. అమ్మా, నీ బీరువాలోనుంచి నేను ఏమయినా తీసుకెళ్లానా ? డబ్బు తీశానా ?"

"డబ్బు తియ్యటమేమిటే ?పిచ్చిమాటలు ? అట్లా బీరువాలో పెట్టుకుంటానా డబ్బు ? తాళంచెవులు ఎప్పుడూ నా దగ్గరే ఉంటాయి. కలవరిస్తున్నావా ? బాగా మెలకువ వచ్చిందా ? గ్లాసెడు మంచినీళ్ళు తాగి పడుకో" మని దుప్పటి బాగా కప్పింది.

నీల ఐదునిమిషాలపాటు మౌనంగా పడుకుంది.

మళ్లీ వెంకటస్వామి కళ్ళముందర నిలబడినట్లనిపించింది. కళ్ళు మిలా మిల్లాడినట్లయింది నీలకు.

మొదటి చూపులోనే ఆమె నాకర్షించిన విగ్రహం. ఆ ఆకర్షణే క్రమంగా ఆత్మీయతగా మారటం మొదలు పెట్టింది కొద్దిరోజులకే.

ఆమె ఎన్నుకున్నవాడు-మనసు కలిపినవాడు-ఆమె సహాధ్యాయి-విద్యార్థి నాయకుడు వెంకటస్వామి. అతడి చమత్కార సంభాషణలు. గంభీర మైన ప్రబోధాలు-అతడి ప్రసంగ కౌశలమూ-విద్యార్థులలో పలుకుబడీ-సాహసమూ ఆమెను ముగ్ధురాలిని చేశాయి.

అవేనా ?

అతడి నడక-స్టైల్-వేషధారణ చిరునవ్వు ఆమెను వశంచేసుకున్నాయి.

కాలేజిలో చేరిన మొదటి నెలలోనే ప్రారంభమైన అభిమానం డిగ్రీ చేతికి అందకమునుపే ప్రణయంలోకి దిగింది.

''ఏమిటీ చెప్పులరిగిపోయాయి. చూసుకోలేదా ? ఇంతవరకూ ఎప్పుడైనా నలిగిన బట్టలు వేసుకున్నావా ? ఎంత ట్రిమ్‌గా డ్రెస్‌చేసుకొనేవాడివి ? ఇప్పుడీ వేషమేమిటి ? ఇలా మారిపోయావేం ?'' అడిగేటంత చొరవ, చనువు ఏర్పడ్డాయి నీలకు.

అతడామెకంటికి కనబడి అప్పటికి వారమైంది.

ఆమె మనసు ఎంత తహతహలాడిందో ?

క్లాసులో బయటా కళ్ళతో వెతుకుతోంది.

ఎక్కడికి వెళ్ళాడు ?

ఏమయిపోయాడు ?

ఆమె మనసు అలమటించిపోతోంది.

చివరికొకనాడు ఈ అవతారంలో కనుపించాడు.

"ఎక్కడికి వెళ్ళావిన్నాళ్ళు ? ఎదురు చూసిచూసి కళ్ళు కాయలు కాశాయి"

''ఏమిటో-కాలేజికి రాబుద్ధికాలేదు. బుర్రపనిచేయటం మానేసింది."

"ఏం జరిగింది ? అంత అనాసక్తత ఏమిటి? బుర్రపనిచేయటం లేదంటే ఏమర్థం ?''

''ఏం జరగలేదు కనుకనే''

''అబ్బ, ఏమిటో చెప్పుస్వామీ : నాకర్థమయ్యేటట్టు చెప్పుస్వామీ ?''

''అర్థం కావటానికేముంది ? నీవు తలుచుకుంటే నా బుర్రచేత పని చేయించగలవు. అంతా నీచేతిలోనే ఉంది'' అంటూ వొత్తివొత్తి అన్నాడా మాటలు ఆమెను క్రీగంటచూస్తూ.

''అంటే ?''

''ఇంకా అర్థంకాలేదా? మనిద్దరిమధ్య గల అనుబంధాన్ని ఏమంటారు?''

''ప్రేమ అంటారు''

''దాని పరిణామమేమిటి ?''

''పెళ్ళి''

''తెలుసుకదా ? తెలిసే తెలియదంటావేం''

''చేసుకుందాం. దానికింత ఇదా ?''

''మనిద్దరం పెళ్ళిచేసుకుంటే ఆదర్శ వివాహమవుతుంది.''

''నేను సిద్ధంగా ఉన్నానన్నానుగా ?''

''అలా దారికిరా. కులం-మతం-వర్ణం-వర్గం అంటూ ఈ విభేధాలేమిటి మనలో మనకు ? మన సమాజంలో నుంచి వీటిని సమూలంగా పెరికి వేయాలంటే పెళ్ళిళ్ళే పరిష్కార మార్గం. ఈ సంగతి ఉపన్యాసాలల్లో కాక చేతల్లో ఉందని మనవాళ్ళకు ఎప్పుడు అర్థమవుతుంది. ఈ విభేదాలతోనే దేశ సమైక్యతను ఇంత వరకూ సాధించలేకపోయారు. వీటితోనే దేశం అధోగతి పాలయిపోతోంది''

అతడి వాగ్ధాటికి ఆమె ముగ్ధురాలయింది. అతడి మాటలలో సమ్మోహనా శక్తితుల్యమైన శక్తి ఏదో ఉంది.

ఆమె అరమోడ్పు కళ్లతో అతడినే చూస్తున్నది కన్నార్పకుండా. అతడి వాక్పటిమ ఎంత శక్తివంతమైనది !

ఆ సంగతి క్రీగంట కనిపెట్టి అతడు మరింత విజృంభించాడు.

''చూడు నీలా, మన మధ్యగల ప్రేమ నిర్మలమైనదై తే-మనలో ఏమాత్ర మయినా దేశాభిమానముంటే-మనం సంఘంపెట్టిన గిరులుదాటి పెళ్ళిచేసుకుని, పదిమందికీ చాటిచెప్పాలి. మనం ఆదర్శవంతులంగా నిలిచి-సంఘానికి దారి చూపుదాం. నాతో చెయ్యి కలుపుతావా ?'' ఆమె కళ్ళల్లోకి చూస్తున్నాడు-ముక్కు పుటాలదురుతుండగా కనుబొమలు పైకెత్తి కళ్ళు తిప్పుతూ ఉద్రేకంతో చెయ్యి చాపాడు.

అతడికి తనపట్ల గల ప్రేమకూ పట్టుదలకూ దేశభక్తికీ ఆమె వివశురాలయి అతడి చేతిలో చెయ్యివేసింది.

"ఈ విషయంలో ఎవరి మాటలూ-నిషేధాజ్ఞలూ సరకు చెయ్యకూడదు. కన్నవారినయినా సరే-ఎదిరించి ముందడుగు వెయ్యాలి. వెనక్కులాగే స్నేహితు లుంటారు. ఈ అవరోధాలనన్నిటినీ అధిగమించి బైటికిరావాలి. అమ్మ ఏడ్చిం దనీ, నాన్నకోప్పడాడనీ ఆఖరి నిమిషంలో మోసబోకూడదు. ఆత్మీయుల్లా వచ్చి వెనక్కులాగుతారు కొందరు. నీ మాట స్థిరంగా ఉండాలి'' హెచ్చరించాడు.

''స్వామీ. ఇంతకాలం నుంచీ నన్ను చూస్తున్నావు. నా మనసు గ్రహించ లేదా ? నాది ముందడుగనుకో''

"మన యువతరం ఆదర్శయుతంగా ఉండాలంటే ఎటువంటి కష్టాలెదు రయినా ధైర్యాన్ని జారవిడవకూడదు."

"నాకన్నీ తెలుసు.''

''ఆ మాటమీద స్థిరంగా నిలబడు''

నీల స్వామిని మనసారా నమ్మింది.

''అయితే ఎప్పుడు రమ్మంటావు ?"

''రేపు తెల్లవారకముందే స్టేషన్‌లో ఉండాలి. చీకటి అనకూడదు''

''అనను స్వామీ. నీవు ఎదురుచూడకమునుపే నీ ఎదుట ఉంటాను"

ఇద్దరూ మధురోహలతో విడిపోయారు.

కాని-ఎక్స్‌కర్షన్‌లో స్వామి అభిరుచులు కొన్ని వెగటనిపించాయి

నీలకు. అయినా స్వామికిచ్చిన మాట తప్పకూడదనిపిస్తోంది. పెళ్ళిచేసుకోదలచు కుంటే స్వామికంటె అందగాడు మనసున్న మంచిమనిషి తనకెక్కడ దొరుకుతాడు?

తన మనసు ఇదివరకే అతడి వశమైపోయింది.

అతడు చెప్పినట్టుగా దేశాభివృద్ధికి తమవంటివాళ్ళు కొంతమంది త్యాగం చెయ్యాలి.

పెళ్ళి చేసుకోవలసిందే. డబ్బూ కొన్నినగలూ అమ్మ బీరువాలోనుంచి తీసుకుని మంచిచీరెలు ఏరుకుని పెట్టె సర్దుకోవాలి. ఇప్పుడు గంట రెండు. నాలుగ్గంటలకి లేచినాచాలు'' మళ్ళి కళ్ళుమూసుకుని కలతనిద్రలోకి జారి పోయింది.

సుమారు నాలుగు గంటలకు కలలో స్వామి కాలరుద్రుడై కదంతొక్కు తున్నాడు.

అతడు డబ్బు తీసుకురమ్మంటాడు ఎక్కడినుంచి ? అతడికా ఉద్యోగం లేదు. తను బీరువాలోనుంచి తల్లికి చెప్పకుండా తీసుకునిపోయిన వన్నీ అమ్మి ఇచ్చింది. తను ఉద్యోగం చూసుకుంది. జీతంలో సగం అతడే తీసుకుంటాడు. తను బాధపడుతుంది. మెల్లగా అతడికి నచ్చచెబుతుంది. వినడు. ఇన్ని కష్టాలతో తనొక శుభవార్త అతడికి చెప్పాలని ఎదురుచూస్తుంది. రెండు నెలలు ఎదురు చూడగా వచ్చాడు. మళ్లీ డబ్బడిగాడు.

''స్వామీ, నీకొక శుభవార్త వినిపించాలని ఇన్నాళ్ళనుంచీ ఎదురుచూస్తు న్నాను. మనకోపాప ఈ లోకంలోకి రాబోతోంది.''

"ఆఁ ? మనకొకపాప ?"

వెర్రినవ్వు నవ్వాడు.

"ముందు నాకు డబ్బివ్వు"

"ఇంకా జీతం రాలేదుస్వామీ."

''ఈ రాత్రికుంటాను. మీ వాళ్ళింటినుంచి తీసుకొస్తావా ?"

"అదెలా స్వామీ ? వాళ్ళగడప మళ్లీ తొక్కనని వచ్చేశాను కదా ? ఇప్పుడు డబ్బుకని వెళ్ళితే ఇస్తారా ? అన్నిటికంటె ముందు నన్ను రానిస్తారా ?"

''ఏవో సాకులు చెబుతావు.. మీ బుద్ధులింతే డబ్బులేకపోతే ఎట్లా జరుగుతుంది ?''

"నీవు ఉద్యోగ ప్రయత్నం చెయ్యమంటే చెయ్యవాయెను. ఒక్కరి సంపాదనతో ఖర్చులు గడుస్తాయా ?"

''ఏమన్నావు ? నేను ఉద్యోగ ప్రయత్నం చెయ్యాలా ?"

"మరి నిన్నెందుకు చేసుకున్నది ?'' చెంప ఛెళ్ళుమనిపించాడు.

''ఇందుకా స్వామీ ఈ పెళ్ళి ? నీ నిజస్వరూపం బయటపడుతోంది మెల్ల మెల్లగా. ఇవాళ పూర్తిగా కనబడ్డది.''

''లేక నీ అందాన్ని చూసి ప్రేమించావనుకున్నవా ? డబ్బు-డబ్బుకావాలి'' ఆమెను ఒక నెట్టునెట్టాడు.

అమ్మా అంటూ కిందపడిపోయింది.

"శుభవార్తట. పిల్లలట. పెంచుకో. నేను పోతున్నా'' తలుపులు దభాలున తెరచి వెళ్ళిపోయాడు.

పనిమనిషి సహాయంతో తెల్లవారి హాస్పిటల్‌కి వెళ్ళింది. ఆ సాయంత్రానికి అబార్షనయింది.

జనరల్ వార్డులో ఉన్న నీలను చూసి ''ఇదేమిటి ? నీవిక్కడికెట్లా వచ్చావు'' అన్నది డ్యూటీ డాక్టరు. ఆమె నీల తల్లికి క్లబ్బు స్నేహితురాలు.

నీల మాట్లాడలేకపోయింది.

"అమ్మే చేర్పించిందా ఈ జనరల్ వార్డులో ? ఎప్పుడు ?''

''కడుపునొప్పిగా ఉంటే నేనే వచ్చాను"

''ఇంట్లో నేను చూస్తాను. పద, కార్లో దింపుతాను"

అమ్మా అంటూ దిగ్గునలేచింది నీల. కళ్ళవెంట నీళ్లు కారిపోతున్నాయి. నిలువెల్లా ఒణికిపోతోంది.

తల్లి దిగ్గునలేచింది. "ఏమిటి నీలా. మళ్ళీలేచావు ? జ్వరం ఎక్కువయిందా ?" నీల నుదుటిమీద చెయ్యేసింది.

''ఇంత చెమటలు పోస్తున్నాయేమిటి ?" ముఖమంతా బట్టపెట్టి తుడిచింది. ఆమె భయపడుతూ కాంతాన్ని పిలిచింది. అతడు తండ్రితో నీల గదిలోకి వచ్చాడు.

''ఇప్పుడేం చేద్దాం ? డాక్టర్ని రమ్మన్నాఫోనుచేసి ?"

''వద్దు-వద్దు. డాక్టరువద్దు. నాకు వేడివేడి కప్పుకాఫీ పంపించు. నీవిక్కడే ఉండమ్మా" తల్లిని పట్టుకుని విడిచిపెట్టలేదు నీల. తండ్రినిచూసి ఒణికిపోతోంది.

''సరే ఎట్లాగూ తెల్లవారుతోంది కదా, ఈలోపల నిద్రపట్టవచ్చు'' తండ్రి కాంతం వెళ్ళిపోయారు.

ఏడుగంటల తరువాత బాగా నిద్రపోయి లేచినట్టుగాఉంది. నీల ముఖం కడిగి స్నానం చేసింది.

"అమ్మా మా మేడమ్‌ని ఒకసారిరమ్మని ఫోనుచేస్తావా ? కాలేజికి మనింటి నుంచే వెళ్లమని చెప్పమ్మా"

"ఇప్పుడే ఎందుకు ? సాయంత్రము కాలేజినుంచి రమ్మంటాను"

"కాదమ్మా ఇప్పుడే రమ్మను"

ఆమె ఫోను చేసేటప్పుడు తండ్రి వింటునేఉన్నాడు.

మేడమ్ కాత్యాయిని విద్యార్థినులను తల్లిలా చూసుకుంటుంది. వాళ్ల ఎదురు తిరిగినట్లు సూచనలు కనబడగానే తల్లిలాగే చివాట్లు పెడుతుంది. నడి వయసు దాటింది. విద్యార్థినీ విద్యార్థులతో బాగా అనుభవం సంపాదించింది.

మేడమ్ కాత్యాయిని కూడా నీల యింటికి అప్పుడప్పుడు వచ్చి ఆమె తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఉంటుంది. ఆమె నీల యింటినుంచి, ఫోనురాగానే కారులో వచ్చింది. అందర్ని కుశలప్రశ్నలు వేస్తూ నీలను వెతుక్కుంటూ ఆమె గదిలోకి వచ్చింది.

నీల నీరసంగా పడుకుని ఉండటం చూసి ''ఏం జబ్బుచేసింది ? ఇంత నీరసపడిపోయావు నీలా ?''

అంతలో నీల తల్లి కాఫీ తీసుకువచ్చి ఆమెకిచ్చి నీల మంచమ్మీద కూర్చుంది.

''ఏమయిందండీ ? నీలకు జ్వరము వచ్చిందా ? జబ్బుపడ్డట్టు చిక్కి-పోయింది. మాటకూడా సరిగా రావటంలేదు ?'' కాఫీకప్పు కిందపెడుతూ అడిగింది.

''రెండు రోజులకిందట ఎక్స్‌కర్షన్ అంటూ వెళ్ళింది. ఓ పాతికమంది పిల్లలు వ్యాన్ తీసుకునివెళ్లారు. సాయంత్రం చీకటిపడుతూనే వచ్చింది. అలసిపోయి పడుకుందేమో ననుకున్నాను. ఒక రాత్రివేళ అమ్మా అంటూ పెద్దకేక పెట్టింది. లేచిచూశాను. జ్వరం తగిలినట్టుందని ఒక క్రోసీన్ మాత్ర అబ్బాయి తీసుకవచ్చివేశాడు. నన్ను కదలనీయకుండా గట్టిగా పట్టుకుని పడుకుంది మళ్ళీ తెల్లవారేముందర-ఐదు గంటలవుతుందేమో ? మళ్లీ అమ్మా అంటూ పెద్దకేక పెట్టింది. నేను లేచిచూస్తే ఒళ్లంతా చెమటలు కారిపోతున్నాయి. ఆ కేకతో తండ్రి కూడా వచ్చారు ఆదుర్దాపడుతూ. 'డాక్టరికి ఫోను చెయ్యనా' అంటే వద్దువద్దు అంది. మళ్లీ సర్దుకుని పడుకుని ఏడయిన తరువాత లేచింది. మీకు వెంటనే ఫోను చెయ్యమంది. మీకేం ఇబ్బంది కాలేదుకదా ?" క్షమాపణ పూర్వకంగా అన్నది నీల తల్లి.

తల ఆడిస్తూ "దానికేం ? మనం కొత్తవాళ్ళమా ?'' అన్నది మేడమ్.

అంతలో నీలతల్లికి ఇంట్లోనుంచి పిలుపువచ్చి వెళ్తూ "మీరుకూర్చోండి. నేనిప్పుడే వస్తా'' అంటూ, వెళ్ళింది.

అదే అదననుకుని ''నీలా : నీతో ఎవరెవరు వచ్చారు ఎక్స్‌కర్షన్‌కి ? ఆ కబుర్లు చెప్పు !'' అడిగింది ఆసక్తితో.

నీల ఎవరెవరు వెళ్ళిందీ ఏమేం జరిగిందీ పూసగుచ్చినట్టు చెప్పింది.

"నీవు వ్యాన్‌లో ఇంటికి వచ్చావా ?''

ఆ ప్రశ్నకు నీల అదిరిపడింది. కాని మేడమ్ దగ్గర అబద్ధాలు చెప్పటానికి వీల్లేదు.

"చిన్నకారు వచ్చింది. దాంట్లోవచ్చాను'' మాటలో ఒణుకు స్పష్టంగా కన బడుతోంది.

"ఎవరితోనయినా వచ్చావా ? లేక ఒంటరిగా వచ్చావా ?"

నీల దేహమంతా ఒణికిపోయింది.

''వెంకటస్వామితో''

మీరు పెద్దవాళ్ళతో సంప్రతించకుండా మీ అంతట మీరు ఇటువంటి పార్టీలూ ఎక్స్‌కర్షన్‌లూ పెట్టుకోవద్దని ప్రిన్సిపల్‌గారిచ్చిన వార్నింగులూ నోటీసులూ చూస్తూనే మీఅంతట మీరు వెళ్ళటం రూల్సుకు వ్యతిరేకం. పోనీ ఆడ పిల్లలయినా నన్ను అడిగివెళ్ళవచ్చుగా ? వాళ్ళచేత జుట్టుపీకించుకోవటం, తల కిందులుగా వేలాడదీయించుకోవటం వంటి సరదాల కోసమా వెళ్ళింది ?"

"మేడమ్‌కి ఇదంతా ఎట్లాతెలుసు ?'' నీల కాశ్చర్యంగా ఉంది.

"ఎట్లా తెలిసిందా అనుకుంటున్నావా ? గౌరి కేటీ ఫోనుచేశారు. నీవు వెంకటస్వామితో ఎక్కువగా తిరుగుతున్నట్టు నాకు రిపోర్ట్సు వచ్చాయి. అతడి తాగుడికి డబ్బుకూడా ఇస్తావని తెలిసింది. నీవుఇంకో ముందడుగుకూడా వెయ్యటానికి సిద్ధమవుతున్నట్టు తెలిసింది. వెంకటస్వామి నిజానికి ఇప్పుడు కాలేజి స్టూడెంటుకాదు. ఎప్పుడో కాలేజినుంచి వెళ్ళగొట్టబడ్డాడు. ఇప్పుడతని పని డబ్బుగల అమ్మాయిలను పట్టుకుని పెళ్ళిచేసుకుంటానని తియ్యటి మాటలు చెప్పి వెంటతీసుకువెళ్ళి మూడు నాలుగునెలలు ఉంచుకుని డబ్బయిపోగానే వదలిపెట్టి మళ్ళీ ఇంకో కొత్తఅమ్మాయిని పట్టుకోవటం. మూడు నాలుగు కేసులు విన్నాను. అంతా తెలిసిఉండికూడా ఆడపిల్లలు అతడి మాటలకు ఆకర్షింపబడు తున్నారు. నీవంతా చెప్పకపోయినా నాకు చాలావరకూ తెలిసింది. బ్రౌనుషుగర్ కూడా అలవాటు చేస్తున్నట్టు విన్నాను ''

నీల ఉలిక్కిపడ్డది.

''నీవు కాలేజికి రేపటినుంచి రాకు. పరీక్షలకు బాగా చదువు. ఎటెండెన్సు సరిపోతుంది. మీ నాన్నను తీసుకువచ్చి పరీక్షరాయి.''

అంతలో తల్లి వచ్చింది.

''మొన్నటి ఎక్స్కర్షన్నుంచి వచ్చిన తరువాత ఏదో భయపడినట్ల పిస్తోందండీ. పిచ్చిచూపులు పరాకు మాటలు ఉన్నట్టుండి జ్వరం రావటం-అంతాచూస్తే నా కలా అనిపించింది. ఏ అడవుల్లోకి వెళ్ళారో ఏమిటో?" విచారంగా ఉంది నీలతల్లి మనసు.

''అదే అయుంటుంది. పోర్షన్ అయింది కనుక కాలేజికి రాకపోయినా ఇబ్బందిలేదు. పరీక్షలకు వచ్చేటప్పుడు భయపడకుండా మీ వారిని కూడా పంపండి. నాకు కాలేజికి టైమయింది, వెళ్తాను. మీవారికి చెప్పండి.'' అంటూ వెళ్ళింది మేడమ్ కాత్యాయిని.